# అరిటాకులు

వారం ఆదివారం కానిరోజుల్లో ఒక రోజు.

పదిగంటల పగటివేళ

ఎర్రనివాడు

ఎంచక్కని నయనమ్ములవాడు

కృపారసం స్థానే మాములు చూపులు వెదజల్లెడువాడు.

మౌళి పరిసర్పిత ఫించం మానేసి , నిగనిగలాడే క్రాపు తొడుక్కున్నవాడు.

ఎవ్వరి ధనమూ దోచనివాడు

మల్లియలచాయన దాక్కో నవసరం లేనివాడు.

దాక్కుందామన్నా దాదాపు పదిమైళ్ళపరిధిలో మల్లెపొదలు లేనిచోట, మహానగరపు ప్రధాన రక్తనాళాలలో ఒక్కటయిన ఈడెన్ రోడ్డు చిట్టచివరి బస్‌స్టాండును సమీపించాడు. నిల్చున్నాడు. ఇంకా నిల్చున్నాడు.

[అతడెక్కవలసిన బస్సు నిలుస్తుందన్న సంకేతంనుండి ఒక క్యూ ముప్పై గజాలది పెరిగి వున్నది. ఆ వరుసలో ఆరంభంనుండి జనగణమనదాకా...అమ్మాయిలే!పువ్వుల్లాటి పిల్లలు...మల్లెలూ ఉమ్మెత్తలూ, గులాబీలూ, గురివెందలూ, జాజులూ జిల్లేళ్ళూ కలిసి చిత్రమయిన పూలమాలలా వుంది. ..అమానినీమాల. కాని ఆ నారీ తోరణంమధ్య కాగితం పువ్వులాటి అర్ధనారీశ్వరరూపం ఒక్కటి ఉంది.మోచేతికి పైగా చేతులు మడుచుకున్న పూలచొక్కా , బొడ్డుకిందుగా తోలువడ్డాణాన్ని అంటిపెట్టుకొని మడమలకు పైనే మేజోళ్ళలో కలిసిపోయిన గళ్ళ పంట్లాం, కుడిచేతికి రంగు రంగుల పట్టీ, చేతికొక పెద్దవాచీ , గ్రీన్‌రూమ్‌లో అద్దం వెతుక్కుంటున్న వాడిలా మొహం ...మొదలుగాగల ఒక మగపురుగు నిల్చునివుంది. ఆశాల్తీ ఆడది కానిదని పోల్చడానికి కాస్త ఆలస్యమయినా 'అమ్మయ్య'! ఈ రమణీ రంగంలోకి మరీ ఒంటరిగా ఇరుక్కుపోనక్కర్లేదు కద'...అని నిట్టూర్చాడు ఎర్రబ్బాయి.

పూలమాలలో గాలివాన బయలుదేరింది.

'చివర్నిచూశావటే జానీ'?

'కళ్ళుమాత్రం అద్భుతం..ఎ పొయెట్స్ ఐస్'

'తెల్లచొక్కాలో ముద్దొస్తున్నాడుస్మీ'

'ఎవరు చెప్మా,స్టూడెంటా?'

'అయితే పుస్తకాల్లేవే?'

'రోజు కనబడడు కూడాను'

'ఆఫీసరేమో..'

'అందరాఫీసర్లకూ కార్లేడుస్తాయా? '

'ఎవతె హృదయమో ఇతగాడి ఆఫీసు?'

ఇవ్విధంబున ఆఅమ్మాయిలు ఊహాగానాలు చేయడం మొటలెట్టారు. ఇరవైనిమిషాలుగా 'క్యూ'లో మొట్టమొదట నిల్చున్న జర్మనుకత్తిలాటి సొగసుకత్తి ఝామ్మున వెనక్కు నడిచింది. ఆమెపేరు మదనిక. ఆమె లక్ష్యం ఎర్రబ్బాయి పక్కస్థలం.

'అంతట --క్లియోపాత్రా ప్రవేశము--'అని నాంది పలికిందొక నాతి.

'శీఘ్రమేవ ప్రాప్తిరస్తు' అని మంగళాశాసనం చేసిందో మగువ.

క్యూలోనుండి సుషమాదేవినుండి మిస్ ఆశీర్వాదం దాకా ఎర్రబ్బాయిమీద అభిప్రాయాలతో ఆలోచనతో నిండిపోయారు. సదరు అబ్బాయి మాత్రం , శరీరంలోని కీళ్ళలాంటి ఏర్పాట్లన్నీ బిగుసుకు పోయినట్లవగా ఇటూ అటూ తిరక్క, తిరగలేక, తిరిగి చూడలేక, తిన్నగా ఎదుటవున్న చెట్టుమీది పావురాళ్ళని కాకులనుకొని లెక్కబెట్టపోతే , రెండుతర్వాత అంకెలు రామన్నాయి.

మదనిక గమ్యం చేరింది. 'టైమెంత మిష్టర్?'

అదిరిపడ్డాడు. అబ్బాయి. అతగాడి ఫుల్‌షర్టుచేతికింద వాచీలేదని మదనికకు తెలియకకాదు మెతుకునిబట్టి అన్నం వాటం చూద్దామని వయసు వేసిన ప్రశ్న అది.

అయినప్పటికీ, తరతరాల పురుషత్వానికి (అ.నారీశ్వర్రావ్ మినహా)అక్షణాన ఏకైక ప్రతినిధయిన ఆ అబ్బాయి చాల గౌరవంగా "పదికి పదినిముషాలుంటుందండీ"అని మదనికను చూశాడు. ఒక్క క్షణంసేపు కళ్ళుమూసుకుపొయ్యాయి. తారురోడ్డుమీద ఒలికిన పాలలా నవ్వింది మదనిక. ఇటు తిరిగాడు అబ్బాయి.

'మీరెందాకనండీ' అబ్బాయి కివతలున్న రెండుజడల జానకి అడిగింది'.

'యూనివర్శిటీ దాక!'

'ఏం చదువుతున్నారేవిటీ'

'చదవడం లేదండీ'

'మరి ? జానకి చెయ్యి అతగాడికి తగిలినట్లయింది.

కాస్తదూరంగా జరిగాడు.

'బ్రేవో జానీ బ్రేవో!'అని ఈలవేసింది ఇరవైమూడంగుళాల మెడగల సుకుమారి.

'షటప్"అంది జానకి.

తన్నేమోనని వణికిపోయాడు అబ్బాయి.

'మన జానకమ్మ మేరేజ్–డాటరాయెనే'

అని ముక్కుతో పాడింది సుకుమారి కివతలున్న పంకజం. వాళ్ళిద్దరి విషయ మేమిటో తేల్చుకుందామని అటు నడిచింది జానకి. ఆమె చోటులోకి జరిగింది. మూడుజతల మంజీర. 'స్వామీ తమరు మండుటెండలో మాడకపోతే, టాక్సీలో నిష్క్రమింతము రారే' అంది.

పరిహాసమో కాదో తెలియరాని అబ్బాయి చెమటల షవర్‌బాత్ కిందవున్నాడు. ఈరభసకంతటికీ తను కేంద్రంకాలేదే అని అసూయపడుతున్న అ॥ నారీశ్వర్‌రావు మినహాయిస్తే కనుచూపుమేరలో పోతుటీగకూడా కన్పించలేదు.

అబ్బాయి భుజాన్ని తట్టింది మంజీర. ప్రాసకీడలాడ్డం మొదలెట్టింది.

'నిన్నేనోయ్ సొగసుకాడా, భయమేల మాటాడా?'

'ఇంతకు పేరేమిటో' వెనకాలవచ్చి అడిగింది పాతికా మూడేళ్ళ ప్రఫుల్ల–ఓణీని సర్దుకుంటూ.

గట్టిగా దగ్గబోయి అదిరాక, ఎంగిలి మింగబోయి అదిలేనివాడయి, గొంతుకింది రెండోబొత్తాన్ని వదులుచేద్దామన్న సదుద్దేశంతో , మెడనుండి నడుముదాకా గల ఓపెన్‌షర్టు బొత్తాలన్నీ విప్పేసుకుని . ఒకదానిని వేయబోతూ ఇంకోదానిలోకి వేసుకుంటూ, ఊపిరిఆడడమే మహాభాగ్యమయిపోయిన పరిస్థితులలో 'నాపేరు కృష్ణ అంటారండి' అన్నాడు అబ్బాయి, బోనులో నిలబడ్డ ముద్దాయిలా.

'దట్స్ నైస్ మైబాయ్! నేను రాధని, మీ అత్తయ్యని!' పక్కనవున్న బాబ్‌డ్ తలమ్మాయి.

'ఓహో!' అన్నాడు అబ్బాయి రాధ నెత్తిమీది రాగిజుత్తును పరికించినవాడయి.

'యూసిల్లీ' అప్పుడే భాగవతంలోకి వెళ్ళిపోకుస్మీ' అని విట్టింది రాధ.

క్రికెట్‌ఆటలో బౌండరీ చూసినవాళ్ళల్లా కెవ్వుమని నవ్వారు ఆ పూబోడులు.

నవ్వబోయిన కృష్ణ పెదవులు గంజిలో తడిసి ఎండిన చొక్కాలా ముడుచుకుపో యాయి.

ఇంతలో బస్సురానే వచ్చింది.

అర్ధనారీశ్వరుడు చచ్చిమొత్తుకున్నా బస్సెక్కనివ్వలేదు ఆ అబలలు. తటపటాయి స్తున్న కృష్ణుడిని మాత్రం అతిభద్రంగా లాక్కువెళ్ళింది నొక్కులజుత్తు సత్యవతి.

సీట్లన్నీ నిండిపోయాయి.

అర్ధరాత్రివేళ వెలుతురు పడగానే హఠాత్తుగా దుప్పటి మడతల్లో నక్కిన నల్లిలా ఒక మూలకొదిగి నిలుచుండినాడు యువతులమధ్య ఆ యువకుడు.

'అలా నిల్చుంటావేమోయ్ మోహనరంగం కూర్చోపాపం..' అని తానులేచి నిల్చుంది మదనిక.'

కళ్ళుమూసుకున్న కృష్ణన్ని లాగి కూర్చోపెట్టింది మిస్. ఆశీర్వాదం. అతడికవతల అదే సీటులో కిటికీనానుకొని కూర్చుంది సుషమాదేవి.

మంచి రచయిత చేతిలో కలంలా ఝామ్మని నడుస్తోంది బస్సు. యవ్వనం లాలిస్తోంది సముద్రపుగాలివలె అయినా – పెనంమీదపడ్డ దోసెలావున్నాడు కృష్ణనామధేయుడు. ముందుకూర్చున్న ప్రఫుల్లనిచూస్తే మూడుపొరల వస్త్రాలు కనపడ్డాయి. పక్కకు చూచాడు. సుషమశరీరంతప్ప అవతలివేమీ అగుపించలేదు. లేచినిల్చున్న శాల్తీమీదకు దృష్టి సారించాడు. సిగ్గుపడి ఆగిపోయిన చోళీని కలుసుకుందామని వృథాగా ప్రయత్నిస్తున్న చీరనుచూసి తెల్లగా నవ్వింది నడుము. ఆపక్కనే నిల్చున్న మంజీరగారి పవిట, ఆమె భుజంతో దాగుడుమూతలాడుతూంది. అబ్బాయి తలలోపల అతడి ముందుతరాలవారు కూచుని ఏమిటేమిటో అడుగుతున్నారు.

ఇంతలో కండక్టర్ వచ్చింది.

'యూనివర్సిటీ టూ ప్లీజ్' అని జానకి డబ్బిచ్చింది తనకు అబ్బాయికీ కలిపి.

'ఆయనకయితే టిక్కట్టక్కర్లేదు' అని ఒక సమ్మోహనంపు నవ్వు నవ్వింది కండక్టరు కృష్ణనుచూస్తూ.

'రెండు యూనివర్సిటీ' అని నొక్కి పలికి' కండక్టర్ని తీక్షణంగా చూసింది జానకి.

ఇంకా తనలో తాను ప్రశ్నలువేసుకోవడం మానలేదు కృష్ణ.

'ఆలోచనలో పడ్డారే అయ్యగారూ!'

'కాలర్ కింద ఆ మసకేవిటీ శశీ?'

'పాదరక్షలమీద అంత ధూళి ఏలనో?'

'పాపం పాలిష్కు చందాలు వేద్దాములే'

అబ్బాయి, అబ్బాయి గనక ఏడవకుండా, పళ్ళు బిగించుకున్నాడు. నాలుక పళ్ళ సందున ఇరుక్కుని చురుక్కుమంది

ఈలోపుగా వెనుకసీట్లోంచి అర్జంటుగా ముందుకు వంగింది అరవింద.అబ్బాయి కుడిచేతిని లాగి అరచేతిని ఓక్షణం పరిశీలించింది 'ఊ, ఊ, వీనస్ మౌంట్ మాంచి ఇదిగా వుందోయ్ మదనసింగూ' అని వంకరగా నవ్వింది.

జవాబంటూ ఏదయినా చెబితేచాలు, డొక్కచీల్చి డోలుకట్టి ఆదితాళం వాయిస్తారేమో ననిపించింది అబ్బాయికి. ఆ ఛండాలపుబస్సు దిగి నడిచిపోదామని లేచాడు.

అతడిని లాగి కూచోబెట్టింది. సుషమ.

"ఇది పడుచుదనం రైలుబండోయ్ రాజశేఖరా! యూనివర్సిటీ వెళ్ళేదాక ఆగదు.." అంది మూడుసీట్లు ముందున్న మంజీర.

'హోల్డ్యు స్మోక్ ప్లీజ్' ఆశీర్వాదం ఓ పసుపురంగుపెట్టెనందిచ్చింది.

బెదురుకళ్ళతో తల అడ్డంగా వూపాడు కృష్ణ.

'మరీ అంత రాతియుగమయితే ఎట్లా?'అంది ఆశీర్వాదం నోట్లోని సిగిరెట్‌ని తీయకుండానే పొగవదులుతూ.

"పొగ త్రాగరాదు"అని ఎర్రక్షరాల బోర్డులా అరిచింది కండక్టరు.

'తాగడం లేదమ్మా తాటకీ! పీలవడం మాత్రమే జరుగుతూంది' అంది ఆశీర్వాదం, సిగరెట్టు పెట్టెను కండక్టర్ వైపు విసురుతూ. నవ్వునూ, సిగరెట్టునూ వెలిగించింది కండక్టరు.

"అయితే మిష్టరు కృష్ణమోహన్! మీకెంత మంది బుడుగులూ?" ఎంతో వినయంతో అడిగింది ప్రఫుల్ల దగ్గరిగావచ్చి.

ఘొల్లన్న నవ్వుతో బస్సుటాపు ఒక్క అంగుళం పైకి లేచిపోయింది. విసుక్కుని చూపుడువేలితో దానిని కిందకు లాగింది సుకుమారి.

"అలా అల్లరిపెట్టకండే ఋష్యశృంగుడినీ!"అని ప్రఫుల్లను తోసుకొచ్చి రహస్యంగా అడిగింది రామలక్ష్మి. "నాతో చెప్పమ్మా కృష్ణుడూ! మనకూ..ఎందరూ? "

ఈసారి అంత సుకుమారికూడా బస్సుటాపుని రెండుచేతులతోనూ లాగి దింపాల్సివచ్చింది.

ఇంకాస్సేపుంటే ఉగ్గుగిన్నెతో, ఆముదంతో పట్టేస్తారేమోనని అన్పించకపోలేదు. అబ్బాయి సరిగ్గా అక్షణాన అతీతమయిన శక్తి ఏదో అడ్డుపడింది.–పరిస్థితి మరీ ఇదయిపోకుండా.

అబ్బాయి ఒడిలోకి జానకియొక్క లేసు సామాన్లబుట్టరాలినప్పుడు, అతడివీపుమీద కనీసం ఆరో ఏడో పుస్తకాలు వర్షించగా, అవి వర్షించినపుడే "ఓగాడ్"అనుకుంటూ సుషమ అతడి భుజంమీదకు వాలింది, కారణం?.

బస్సు ఆగిపోయింది.

"తోయాలి!"అంది కండక్టరు.

కృష్ణ లేచాడు."లేచెనే మగధీరుడూ!"అని పంకజం పాడగా, మళ్ళీ అతడిని లాగి కూచోబెట్టింది సుషమ.

"కీపిటప్ సుషీ!"అంది దిగిపోతున్న సత్యవతి.

"హాపీ ఆక్సిడెంట్స్ !"అంది ఆశీర్వాదం సిగిరెట్టు పారేస్తూ.

చకచక దిగిపోయి బస్సుని తోశారో పదిమంది లలనలు. అది కదలగానే బిలబిలమంటూ ఎక్కేశారు.

"సుషమా! అక్కడ్నుంచి లేవవే!"అంది మాణిక్యం.

"నువ్వుచెప్పు కృష్ణమ్మా! మేనల్లుడి పక్కన అత్తయ్య కాస్సేపయినా కూర్చో వద్దా?" అంది రాధ అతడి మొఖంలోకి చూస్తూ.

పరిత్రాణాయ సాధూనాం– అన్నాడు భగవానుడు. నిజమే. యూనివర్సిటీ గోపురాలు కన్పించాయి.

"ముద్దాయికి కూర్చోవడానికో సోఫా వేయించండి! మైనారిటీ వర్గాలపట్ల సీతకన్ను వేశామన్న కళంకం మనకు రాకూడదు". అని ఆజ్ఞాపించారు జడ్జి మహాలక్ష్మమ్మగారు. ఇటు తిరిగారు. "ముద్దాయి కృష్ణా!" నీమీద ప్రాసిక్యూషన్ వారు మోపుతున్న నిందల్ని విను", అని ప్రాసిక్యూషన్ వైపు తిరిగి "కానివ్వండి " అన్నారు.

కళ్ళజోడు సర్దుకుని ప్రాసిక్యూటర్ పర్వతవర్ధనమ్మ గారు ప్రారంభించారు.

"యువరానర్! సంగ్రహంగా ప్రాసిక్యూషన్ కేసంతా ఇది... ఈ పాతికేళ్ళ పురుషుడు కేవలం అమ్మాయిలకని నిర్దేశించిన 'క్యూ'లోకి ప్రవేశించాడు. ఇది ఆర్టికల్ 903 కింద రెండేళ్ళ శిక్షకు అర్హమయిన నేరం. ఇతడు ఆ క్యూలోని అమ్మాయిలందరితోనూ హద్దులు మీరి జోకులు విసిరాడు. పైపెచ్చు వాళ్ళడిగిన కొన్ని ప్రశ్నలకు జవాబులివ్వక వాళ్ళ ప్రతిపత్తికి భంగం కల్పించాడు. ఇంకా వినండి-క్యూలో నిల్చోవడంతో ఆగిపోక ఈ మగవాడు ఆడువారి బస్సులో ఎక్కాడు. ఎక్కినవాడు వెంటనే దిగిపోక అందులోనే ఉండిపోయాడు. పోనీ అంతటితో ఆగిపోయాడా? లేదు ! మగవారికని ప్రత్యేకించిన సీట్లనొదిలి తగుదునమ్మా అని వెళ్ళి అమ్మాయిల సీట్లో కూర్చున్నాడు. అందులోనూ, కూచున్న ఒక అమ్మాయినిలేపి, ఇది గమనించండి యువరానర్, ఒక అమ్మాయిని లేపి మరీ కూర్చున్నాడు. పెళ్ళికాని ఇంకో అమ్మాయి పక్కన కూర్చున్నాడు. ఇంతచేసీ టిక్కట్టు కొన్నాడా అదీలేదు. పైపెచ్చు సిగిరెట్టు ఆఫర్ చేసిన మరొక యువతిని అవమానించాడు. బస్సు దారిమధ్యలో ఆగిపోతే దిగకుండా బస్సులోనే ఉండ్రాళ్ళను తిన్న వినాయకుడిలా....

"ప్రాసిక్యూషన్ వారు వ్యక్తిగతమయిన నిందలకు పూనుకోరాదు." అని హెచ్చరించారు జడ్జి.

" క్షమించండి యువరానర్!...ఆఫ్టరాల్ ఆడవాళ్ళు దిగితోస్తుంటే ఆ బస్సులో కాలుమీద కాలువేసుకుని కూర్చున్నాడు ఈ మహాబలుడు. ఈ అనాగరకయువకుడు. మొత్తంమీద మనచట్టంలో వెరసి తొమ్మిది ఆర్టికల్స్‌ను పదిహేడు సెక్షన్లు నలభై రెండు సబ్ పేరాలనూ సంపూర్ణంగా, మనఃపూర్వకంగా ఉల్లంఘించాడు. అన్నిటికీ కలిపి జాగ్రత్తగా కూడితే దీనికి కనీసం ఇరవై సంవత్సరాలయినా కారాగారవాసం విధించాల్సి వుంటుంది. ఒకవేళ ఇతడుగనుక పెళ్ళయినవాడయివుంటే సెక్షన్ నూట పదకొండుమేరకు ఇంకో రెండేళ్ళు ఎక్కువగా ఇప్పించాలి.. కనీసం ఈమాత్రమయినా శిక్ష విధించకపోతే, ఇతడిలాంటి రోడ్ సైడ్ రోమియోలు పేట్రేగిపోయి మన ఆడజాతిమనుగడకే ముప్పుతేగలరు యువరానర్-మన ఆడజాతిమనుగడకే ముప్పుతేగలరు. అతిపురాతనమయిన మన ఉజ్జ్వలసంస్కృతికి చీడపురుగులవంటి ఈ బాధ్యతారహితులయిన మగవారికి కనువిప్పు...." అంటూ పర్వతవర్ధనమ్మగారి గొంతు మెషిన్ గన్ లా పేలుతూంది.

బోనులో, వంచిన తలెత్తకుండాకూర్చుని 'భూమాతా! అలనాడు సీతాదేవికి మల్లే ఈనాడు నన్ను నీలో ఇముడ్చుకోవా?' లాంటి ప్రార్థన చేసుకొంటున్నాడు

కృష్ణ. మధ్యమధ్య 'వినాయకుడు- ఇరవైయ్యేళ్ళు- చీడపురుగు-రోమియో - సంస్కృతి - మొదలయిన విశేషణ విశేష్యాలేవో అతడిలోంచే బయలుదేరిన శబ్దాల్లా వినపడుతున్నాయి.'

పెద్దగా చప్పట్లశబ్దమయితే తలెత్తిచూశాడు కృష్ణ. పర్వతవర్ధనమ్మగారు విజయగర్వంతో కూచుంటున్నారు.

"ముద్దాయి కృష్ణా! నీ తరఫున ఎవరు వాదిస్తారు?"అని అడిగారు జడ్జి.

తల అడ్డంగా ఊపాడు కృష్ణ.

"పోనీ నువ్వు ఏమయినా చెప్పదలచుకున్నావా?"

మళ్ళీ తలతో సమాధానం చెప్పాడు కృష్ణ.

అతడి మనస్సుని చీకటి ఆవరించింది. కళ్ళ ఎదుట ఏవిలేవిటో పరిగెడుతున్నాయి ఒళ్ళు ఊగిపోతున్నట్లుంది.

["మొదటిసారి కనుక ... తీవ్రమయిన హెచ్చరిక...దయతలచి విడుదల..."లాటి పదాలేవో గాలిలో తేలుతూ వచ్చాయి. స్మృతితప్పి పడిపోతున్న కృష్ణ చెవుల్లోకి]"

అది మహానగరం మధ్యరోడ్డు.

దానిపేరు ఈడెన్ రోడ్డు.

అప్పుడు పన్నెండు గంటలయింది.

బస్సుకోసం కాచుకుని కాచుకుని వడగొట్టి పడిపోయిన కృష్ణ మొహంమీద ఎవరో సోడానీళ్ళు చల్లారు.

ఇది జరిగిన రెండువారాల తర్వాత ఈకథను విన్న రామారావు అన్నాడుకదా- "అబ్బాయ్ కృష్ణా! ఇంతటి అందమైన కల రావడం చాల అదృష్టంస్మీ" -అని

ఇదేకథ విన్న తర్వాత - "అయ్యబాబోయ్ అలా అంతమంది అమ్మాయిల మధ్య ఇరుక్కుపోవడమే!" అని వణికిపోయాడు కాంతారావు! ఆ తర్వాతనుండీ అమ్మాయిల అంగరక్షకుడుగా వుండడం మానేశాడు కాంతారావు.

(చుక్కాని ఫిబ్ర,'64)